
sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com


హైదరాబాద్ | 11-11-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 191 EDITOR: ROHINI





జేఎన్‌టీయూలో 52 కోట్లు గల్లంతు

సీబీఐకి అందిన ఫిర్యాదులో సంచలన విషయాలు





- కోట్లాది రూపాయల ప్రజాధనం ఎవరి జేబుల్లోకి వెళ్లింది?
- తెలంగాణ ఆడిట్ తనిఖీల్లో లెక్క తేలని కోట్ల నిధులు
- రికార్డులు లేకుండానే జవాబు పత్రాల రవాణా
- అప్పటి ఉన్నతాధికారుల పాత్రపై అనుమానాలు

హైదరాబాద్ జేఎన్‌టీయూలో అసలేం జరుగుతోంది? దాదాపు 52 కోట్ల రూపాయల లెక్కలు ఎందుకు తేలడం లేదు? ఈ నిధుల ఖర్చుపై అనుమానాలకు కారణమేంటి? ఇటీవల సీబీఐకి అందిన ఫిర్యాదులో ఆర్థిక లావాదేవీల నుంచి నియామకాలు, పదోన్నతుల వరకు పలు అంశాలపై కె.పి. భాగ్య వెంకట కుమార్ ఆరోపణలు చేశారు. మరోవైపు, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర ఆడిట్ శాఖ నిర్వహించిన తనిఖీల్లోనూ కోట్ల రూపాయల ఖర్చులకు సరైన ఆధారాలు లేవని వెల్లడైంది. పదేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారాల్లో ఏం జరిగింది? ఆడిట్ నివేదికలు ఏం చెబుతున్నాయి? సీబీఐకి అందిన ఫిర్యాదులోని ఇతర అంశాలేంటి? ఈ ప్రత్యేక కథనంలో చూద్దాం.

- సహనం వందే, హైదరాబాద్

జేఎన్‌టీయూలో ఆర్థిక నిర్వహణపై రాష్ట్ర ఆడిట్ శాఖ నివేదికలతో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కేవలం మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ. 52 కోట్ల మేర ఆడిట్ అభ్యంతరాలు పరిష్కారం కాలేదు. సీబీఐకి అందిన ఫిర్యాదులోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఖర్చు చేసినట్లు చూపిన నిధులకు సంబంధించిన ఓచర్లు, ఇతర రికార్డులు అందుబాటులో లేవని ఆరోపించారు. ఆ నిధులను ఎక్కడ, ఎందుకు ఖర్చు చేశారో నిర్ధారించే ఆధారాలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.46.56 కోట్ల మేర అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగా, 2022-23లో మరో రూ.46.33 కోట్ల అభ్యంతరాలు పరిష్కారం కాలేదు. అదేవిధంగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.52 కోట్లకు సంబంధించిన పెండింగ్ అభ్యంతరాలను కూడా ఆడిట్ తనిఖీల్లో గుర్తించింది. ఇలా వరుసగా మూడేళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో భారీ మొత్తాలకు సరైన లెక్కలు, ఆధారాలు చూపించాల్సి ఉందని ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది. అంటే మొత్తం రూ. 52 కోట్లపై లెక్కలు తేలాల్సి ఉంది. ఇంత భారీ మొత్తానికి ఆధారాలు చూపించకపోవడానికి కారణమేంటి? ఈ నిధులు అభివృద్ధి పనులకే ఖర్చయ్యాయా, లేక దుర్వినియోగం జరిగిందా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఖర్చుల వివరాలు సమర్పించి, ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించాల్సిన బాధ్యత అప్పటి ఉన్నతాధికారులపై ఉంది.


25. RECEIPTS AND CHARGES

The Gross receipts and charges of various accounts during the Year 2023-24 are as follows.

Name of the account	Receipts in Rs	Payments in Rs
1. Examination Account	Rs.300031344.00	Rs.376247505.00

26. RESULT OF AUDIT

The result of audit is considered to be fairly satisfactory.

27. PENDING OBJECTION

(24) Items of objections involving an amount of Rs.524677185.00 are pending for the year under audit. Early action needs for the Settlement of the objections.

AUDIT OFFICER
STATE AUDIT (JNTU)
HYDERABAD TELANGANA.

రాబడుల కంటే అభ్యంతరాల మొత్తం అధికం

2019-20 ఆర్థిక సంవత్సరంలో పరీక్షల విభాగం ద్వారా వచ్చిన ఆదాయం రూ.23 కోట్లు. 2022-23లోనూ ఇదే స్థాయిలో ఆదాయం నమోదైంది. అదేవిధంగా,2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 30కోట్ల ఆదాయం నమోదైంది. ఇలా వరుసగా మూడేళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో భారీ మొత్తాలకు సరైన లెక్కలు, ఆధారాలు చూపించాల్సి ఉందని ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది. అంటే ఈ మూడు సంవత్సరాల్లో కలిపి వచ్చిన మొత్తం ఆదాయం రూ. 76 కోట్లు. అయితే ఆడిట్‌లో పరిష్కారం కాని అభ్యంతరాల మొత్తం రూ. 52 కోట్లు. అయితే ఈ అభ్యంతరాలన్నీ ఆ మూడేళ్లలో జరిగిన లావాదేవీలకే సంబంధించినవి మాత్రమే కావు. గత సంవత్సరాల నుంచి పరిష్కారం కాని అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఖర్చులకు బిల్లులు లేకపోవడం, పూర్తి రికార్డులు సమర్పించకపోవడం, కొనుగోళ్లకు ఆధారాలు చూపకపోవడం వంటి అభ్యంతరాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ప్రతి ఏడాది కొత్త అభ్యంతరాలు చేరడంతో ఈ మొత్తం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో ఇంత పెద్ద మొత్తంలో అభ్యంతరాలు పరిష్కారం కాకపోవడంపై అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

రికార్డుల్లేకుండానే జవాబు పత్రాల రవాణా!

ఆర్థిక అభ్యంతరాలతోపాటు రోజువారీ ఖర్చుల్లోనూ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ఆడిట్ గుర్తించింది. పరీక్షలకు సంబంధించిన 4,515 జవాబు పత్రాల సంచులను గోడౌన్‌కు తరలించేందుకు రూ.6.49 లక్షలు ఖర్చు చేశారు. ఒక్కో సంచికి రూ.125 నుంచి రూ.130 వరకు చెల్లింపులు జరిపారు. అయితే ఈ రవాణాకు ముందస్తు అనుమతి తీసుకోలేదని, సంబంధిత విభాగాధికారుల ఆమోదం కూడా లేదని ఆడిట్ పేర్కొంది. అంతేకాదు, రవాణాకు సంబంధించిన డిస్పాచ్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్ల నమోదు వివరాలు, డిస్పాచ్ మెమోలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఎన్ని సంచులు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించారు? వాటిని ఎవరు స్వీకరించారు? అన్నది నిర్ధారించే రికార్డులు లేవనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరీక్షల జవాబు పత్రాల వంటి కీలకమైన పత్రాల తరలింపునకు సంబంధించిన వివరాలే నమోదు కాకపోవడం విశ్వవిద్యాలయ పర్యవేక్షణ వ్యవస్థపై ఆందోళన కలిగిస్తోంది.

విచారణతోనే నిజాలు వెలుగులోకి

విద్యార్థులు చెల్లించే ఫీజులు, ప్రజాధనంతో నడిచే విశ్వవిద్యాలయంలో ప్రతి ఖర్చుకూ ఆధారాలు ఉండాలి. కానీ రూ. 52 కోట్ల ఆడిట్ అభ్యంతరాలు పరిష్కారం కాకపోవడం, రూ.6.49 లక్షల రవాణా ఖర్చుకు సంబంధించిన కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడం ఆర్థిక నిర్వహణపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి? వాటికి సంబంధించిన పత్రాలు ఎందుకు లేవు? ఆడిట్ అభ్యంతరాలకు ఇంతకాలం సమాధానాలు ఎందుకు ఇవ్వలేదు? ఈ అంశాలపై సమగ్ర విచారణ జరగాలి. సీబీఐ విచారణలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, నష్టం జరిగిన ప్రజాధనాన్ని రాబట్టాలి.

తెరవెనుక ఏం జరిగింది?

ఆడిట్ అభ్యంతరాలు..నిధుల పక్కదారి పట్టినట్లు ఆరోపణలు.. రికార్డుల్లేని ఆర్థిక లావాదేవీలు.. ఇవన్నీ చూస్తుంటే జేఎన్‌టీయూలో తెరవెనుక ఏం జరిగిందన్న అనుమానాలు బలపడుతున్నాయి. అయితే ఈ అక్రమ వ్యవహారాలు జరిగిన సమయంలో కీలక బాధ్యతల్లో ఉన్నదెవరు? నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? నిధుల ఖర్చుకు ఆమోదం తెలిపిందెవరు? ఆడిట్ అభ్యంతరాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోనిదెవరు? ఈ ప్రశ్నలన్నింటి వెనుక అప్పటి కొందరు ఉన్నతాధికారుల పాత్ర ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ వ్యవహారాల్లో తెరవెనుక ఉన్నది ఎవరు? కీలక స్థానాల్లో ఉన్న ఆ అధికారులెవరు? వారి పాత్ర ఏంటి? **పూర్తి వివరాలు తదుపరి కథనంలో చూద్దాం.**

ఏపీలో కూటమి సునామీ

జడ్పీటీసీల్లో కూటమి భారీ విజయం

- వైఎస్సార్సీపీకి కోలుకోలేని ఎదురుదెబ్బ
- ఎంపీటీసీల్లోనూ స్పష్టమైన ఆధిక్యత
- క్షేత్రస్థాయిలో మారిన రాజకీయ సమీకరణాలు
- అధికార పక్షం దూకుడుతో చప్పబడిన ఫ్యాన్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల పోరులో అధికార కూటమి ఊహించని రీతిలో సత్తా చాటింది. మొన్నటి వరకు రాష్ట్రాన్ని ఏలిన ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఈ ఫలితాలు మింగుడుపడడం లేదు. గ్రామస్థాయిలో జరిగిన ఈ ఎన్నికల పోరులో ప్రజలు ఎవరి వైపు నిలబడ్డారనే విషయం వెల్లడవుతోంది. - సహనం వందే, అమరావతి



రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశాయి. మొత్తం 582 జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలు అక్షరాలా సునామీ సృష్టించాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి పోటీ చేయగా, ప్రత్యర్థి పార్టీల నుంచి స్పందన కొరవడింది. ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడేసరికి కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తగా, ప్రతిపక్ష శిబిరంలో తీవ్ర నిరాశ అలుముకుంది.

వైఎస్సార్సీపీకి షాకిచ్చిన ఓటర్లు...

ఈ జడ్పీటీసీ పోరులో కూటమి అభ్యర్థులు ఏకంగా 499 స్థానాలను కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని నిరూపించుకున్నారు. ఇందులో ఒక్క తెలుగుదేశం పార్టీయే 406 స్థానాలను దక్కించుకుంది. ఇక పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 73 స్థానాల్లో ఘన విజయం సాధించగా, భారతీయ జనతా పార్టీ 20 స్థానాల్లో గెలుపొందింది. దీనితో అధికార కూటమి కూటమి బలమేంటో మరోసారి క్షేత్రస్థాయిలో రుజువైంది. మరోవైపు వైఎస్సార్సీపీ ఈ ఎన్నికల్లో కేవలం 76 స్థానాలకు మాత్రమే పరిమితం కావాల్సి వచ్చింది.

ఎంపీటీసీ ఎన్నికల్లోనూ అదే జోరు

కేవలం జడ్పీటీసీలకే పరిమితం కాకుండా, అత్యంత విస్తృతమైన 7,768 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల్లోనూ ఇదే దూకుడు కొనసాగింది. గ్రామస్థాయి నాయకత్వాన్ని నిర్ధారించే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రికార్డు స్థాయి విజయాలను నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీలన్ని కలిసి ఏకంగా 5,861 స్థానాలను తమ ఖాతాలో వేసుకున్నాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ 4,806 స్థానాలను సాధించి తన సత్తా చాటగా, జనసేన 938 స్థానాలను గెలుచుకుంది. అలాగే బీజేపీ సైతం 117స్థానాలను దక్కించుకుని తన ఉనికిని చాటుకుంది.

ఇతర పార్టీల పరిస్థితి ఎలా ఉందంటే

ఈ ఎంపీటీసీ ఎన్నికల బరిలో దిగిన ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్సీపీ కేవలం 1,711 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతకుముందు అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల స్థాయిలో ఈ స్థాయిలో ఎదురుదెబ్బ తగలడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆలోచనలో పడేసింది. కేవలం ప్రధాన పార్టీలే కాకుండా, ఇతర రాజకీయ పక్షాలు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. ఈ పోరులో సీపీఎం 15 స్థానాలను దక్కించుకోగా, కాంగ్రెస్ పార్టీ 9 స్థానాల్లో, అలాగే బహుజన్ సమాజ్ పార్టీ 3 స్థానాల్లో మాత్రమే విజయం సాధించగలిగాయి.

గ్రామాల్లో ప్రజలు ఎవరి వైపు?

ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయ గతిని పూర్తిగా మార్చేసేలా కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలు ఎవరి వైపు ఉన్నారనేదానికి ఈ గణాంకాలే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఓటర్లు కూటమి పాలనపై ఉంచిన నమ్మకం ఈ ఫలితాల ద్వారా మరోసారి బయటపడింది. ప్రతిపక్ష పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బ కాగా, అధికార కూటమికి ఇది మరింత బాధ్యతను పెంచే పరిణామం. రానున్న రోజుల్లో స్థానిక అభివృద్ధికి ఈ ఫలితాలు ఎలాంటి మలుపులు తెస్తాయో వేచి చూడాలి.

సివిల్స్ ఎంపికల్లో మారిన లెక్కలు

నాన్ క్రీమీలేయర్ పరిమితిపై సుప్రీం సంచలన తీర్పు

- 1993 మెమొరాండమే అంతిమం అని పునరుద్ఘాటన
- ఓబీసీ హక్కులకు అత్యున్నత న్యాయస్థానం పెద్ద పీట

దేశంలో అత్యున్నత సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల కోసం కష్టపడే వేలాది మంది ఓబీసీ అభ్యర్థులకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలక ప్రకటన చేసింది. నాన్ క్రీమీలేయర్ పరిమితిపై కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పునఃపరిశీలన పిటిషన్‌పై ఈ నెల 6వ తేదీన సుదీర్ఘ విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, తన మార్చి 11 నాటి తీర్పును మరోసారి పునరుద్ఘాటించింది. ఈ నిర్ణయంతో సివిల్స్ ఉద్యోగాల కేటాయింపులు, రిజర్వేషన్ల అర్హతలపై నెలకొన్న ఉత్కంఠకు స్పష్టత వచ్చింది.

- సహనం వందే,న్యూఢిల్లీ



ఈ వివాదానికి ప్రధాన మూలం దాదాపు మూడు దశాబ్దాల క్రితం, అంటే 1993లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆఫీస్ మెమొరాండం. అసలు ఆ మెమొరాండం కథేంటో ఒకసారి పరిశీలిస్తే, మన దేశంలో ఓబీసీ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన కొత్తలోనే నాన్ క్రీమీలేయర్ పరిమితిని నిర్ణయించారు. సామాజికంగా, విద్యపరంగా వెనుకబడిన వారికి మాత్రమే ఈ రిజర్వేషన్ ఫలాలు దక్కాలనే ఉద్దేశంతో క్రీమీలేయర్ భావనను తీసుకువచ్చారు. అయితే గ్రామీణ నేపథ్యం ఉన్నవారికి, సాధారణ ఉద్యోగులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల్లో తల్లిదండ్రుల జీతాలను, వ్యవసాయ భూముల ఆదాయాన్ని నాన్ క్రీమీలేయర్ పరిమితి లెక్కింపు నుండి మినహాయించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయమే దశాబ్దాలుగా ఓబీసీ అభ్యర్థులకు పెద్ద కొండంత అండగా నిలుస్తూ వస్తోంది. ఆప్రకారమే ఏడాది మార్చి 11న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయం ఓబీసీ విద్యార్థులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, తదనంతర పరిణామాలతో అసలు సమస్యలు మొదలయ్యాయి.

ఎంపికలపై చట్టపరమైన చిక్కులు

కోర్టు తీర్పు ప్రభావం సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల తుది జాబితాలు, సర్వీసుల కేటాయింపులపై నేరుగా పడింది. ఇప్పటికే సివిల్స్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్న లేదా పోస్టుల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్న వారి విషయంలో ఈ నిబంధనను ఎలా అన్వయించాలనే దానిపై కేంద్రానికి చట్టపరమైన చిక్కులు ఎదురయ్యాయి. పాత పద్ధతిలో లెక్కించి ఎంపిక చేసిన వారి విషయంలో గందరగోళం తలెత్తడంతో మొత్తం ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడింది. ఈ గందరగోళం, చట్టపరమైన సమస్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్వయంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తీర్పు వల్ల సివిల్స్ అభ్యర్థుల క్లెయిమ్‌లను పరిశీలించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఎంపికల్లో తలెత్తిన చిక్కులను పరిష్కరించి, అభ్యర్థులకు సర్వీసులను సక్రమంగా కేటాయించడానికి తగిన మార్గదర్శకాలను, తదుపరి ఆదేశాలను ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది.

ఓబీసీ హక్కులకు పెద్ద పీట

కేంద్రం వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, 1993 నాటి మెమొరాండం ప్రకారమే ఆదాయ మినహాయింపుల మాటే అంతిమని స్పష్టం చేస్తూ ఓబీసీ వర్గాల హక్కులకు పెద్ద పీట వేసింది. అయితే సర్వీస్ కేటాయింపులలో ఎదురవుతున్న ఇబ్బందులపై తగిన మార్గదర్శకాల కోసం మరింత లోతైన పరిశీలన అవసరమని పేర్కొంది. రాబోయే రోజుల్లో ఇచ్చే కోర్టు ఆదేశాలే ఈ సుదీర్ఘ పోరాటానికి పూర్తి స్థాయి ముగింపు పలకనున్నాయి.